క్లుప్తంగా

విద్యార్థుల క్షేత్ర పర్యటనలు



కంపోస్టు పార్క్ వద్ద కళాశాల విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రగుడులోని రిసోర్స్ కంపోస్ట్ పార్క్‌ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల వృక్ష, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 20 మంది బీఎస్సీ, బీజెడ్‌సీ విద్యార్థులు తమ ప్రాక్టికల్ స్టడీలో భాగంగా పర్యటన చేసినట్లు తెలిపారు. రిసోర్స్ కంపోస్ట్ పార్క్‌లోని డంప్‌యార్డు, పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రం, వర్షపు నీటి ఇంకుడు గుంతలు, ప్లాంటేషన్ బ్లాకులు, తదితర యూనిట్ల పని విధానాలను, వ్యర్థాల సేకరణ, ప్రాసెసింగ్, వర్మి కంపోస్ట్ తయారు చేసే విధానాలపై ప్రత్యక్షంగా చూపి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వై. నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం నుంచి నారాయణపూర్ వరకు జరుగుతున్న బైపాసు రోడ్డు, కిచెన్ షెడ్ నిర్మాణ పనులను గురువారం పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. లక్ష్యంలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే ఎల్లారెడ్డిపేటలో ఒగ్గు శివకుమార్ ఇంటి భవనం కూలిపోగా నష్టం అంచనా వేయాలని ఏఈని ఆదేశించారు. ఏఈ రవీందర్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రం, పద్మారెడ్డి, గుండాడి రాంరెడ్డి, రామదాసు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ అరుణ్‌కుమార్

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, స్థానిక సర్పంచ్ పిట్టల రజితతో కలిసి ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, రోడ్డుకు ఇరువైపుల చెట్లతో గ్రామం అందంగా ఉండడానికి ఉపాధి కూలీల శ్రమనే అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ ఎల్లయ్య, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లను ప్రారంభించరా.?

- ధర్మారం, నిమ్మపల్లిలో పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు
- నిమ్మపల్లిలో ప్రారంభానికి సిద్ధం
- ఏడాదైనా అతీగతిలేని ధర్మారం సబ్‌స్టేషన్



ధర్మారంలో పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు

కోనరావుపేట: మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినా అవి ప్రారంభానికి నోచుకోవడంలేదు. పనులు పూర్తయినా ప్రారంభించేందుకు అధికారులు తాత్సారం చేస్తున్నారు. ధర్మారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. అన్ని రకాల పనులు పూర్తి చేసుకుని ఏడాది అవుతున్నా ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయడంలేదు. సబ్‌స్టేషన్ ప్రారంభం కాకపోవడంతో మూడు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తిప్పలు తప్పడంలేదు.

పూర్తయిన పనులు

కోనరావుపేట మండలం ధర్మారంలో నిర్మించే 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎన్పీడీసీఎల్ నుంచి రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను 2020 ఫిబ్రవరి 6న ఎమ్మెల్యే రమేశ్ బాబు ప్రారంభించారు. ఆపరేటర్ల గది, సబ్‌స్టేషన్ మిషనరీలు, రక్షణ వ్యవస్థ పనులు పూర్తి చేశారు.

నిమ్మపల్లిలోనూ అంతే..

కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు కూడా తాత్సారం చేస్తున్నారు. ఆలస్యం అవుతుండడంతో అధికారులు సబ్‌స్టేషన్ సేవలను ప్రారంభించారు.

మూడు గ్రామాలకు ప్రయోజనం

ధర్మారంలో సబ్‌స్టేషన్ పనులు పూర్తికావడంతో మల్కపేట, ధర్మారం, కనగర్తి గ్రామాలకు లబ్ధి చేకూరనుంది. ధర్మారం గ్రామంలో 800 గృహ కనెక్షన్లు, 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మల్కపేటలో 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కనగర్తి శివారులోని మూడు రైస్‌మిల్లులకు నిరంతర విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. సబ్‌స్టేషన్ ప్రారంభం అయితే ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలుగనుంది.

సబ్‌స్టేషన్ ప్రారంభించాలి



మండలంలోని ధర్మారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యాయి. ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తే ధర్మారంతో పాటు మరో గ్రామానికి ప్రయోజనం కలుగుతుంది. లోవోల్టేజీ సమస్య తీరుతుంది. ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో సబ్‌స్టేషన్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. సబ్‌స్టేషన్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. – ఆసరి దేవరాజ్ యాదవ్, రైతు ధర్మారం

సెస్ పనులు మిగిలి ఉన్నాయి



కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో సేవలు ప్రారంభించాం. ధర్మారంలో నూతన సబ్‌స్టేషన్ పనులు పూర్తయ్యాయి. మిషనరీల బిగింపు తదితర పనులు జరిగినా సబ్‌స్టేషన్‌లో పనిచేసేందుకు అవసరమైన ఆపరేటర్ల నియామకం ఇంకా పూర్తవలేదు. ఆపరేటర్ల నియామకం కాగానే సబ్‌స్టేషన్ ప్రారంభించి సేవలందించే వీలవుతుంది. – శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ, టీఎస్ఎన్పీడీసీఎల్

రెండు ఫీడర్లతో ప్రారంభం చేయవచ్చు



ధర్మారం సబ్‌స్టేషన్‌లో మూడు ఫీడర్లకు రెండు పూర్తయ్యాయి. మరొకటి త్వరలోనే ఏర్పాటు చేస్తాం. అప్పటి వరకు రెండు ఫీడర్లతో పనులు చేసుకోవడానికి వీలుంది. ఆపరేటర్లను ఏర్పాటు చేయలేదు. ఎన్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా చేస్తే తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తే మూడు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి. – పృథ్వీధర్, సెస్ ఏఈ కోనరావుపేట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో గురువారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, మురుగు నీటి కాలువ నిర్వహణ వ్యవస్థను పరిశీలించారు. జనావాసాల్లో ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని యజమానులకు సూచించారు. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే వార్డులో శుభ్రమైన వాతావరణ పరిస్థితి ఉంటుందన్నారు. ఆమె వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లటౌన్: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమున్నవారికి ఉచితంగా అద్దాలతో పాటు మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వార్డు కౌన్సిలర్ సయ్యద్ సీమా బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకథ



రోడ్డుపై గుంత.. ప్రయాణికులకు చింత

వేములవాడరూరల్: ప్రధాన రోడ్డు మీద గుంత పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోరుట్లకు వెళ్లే హరిమల ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డుపై గుంత పడింది. ప్రమాదాలు జరగకుండా రక్షణగా తాత్కాలికంగా వాహనదారులే ఇలా గుంతలో కొమ్మలు రక్షణగా ఏర్పాటు చేశారు.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం'



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల హక్కుల కోసం కోసం పోరాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సంఘం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీలో ప్రధాన భూమిక పోషిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు లేక విద్య వ్యవస్థ గాడితప్పిందని, ఈ వేసవి సెలవుల్లో ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వంగ మల్లేశం, కార్యదర్శి ఆడెపు శివకుమార్, కొత్వాల్ ప్రవీణ్, పాముల స్వామి, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ ఎలగొండ రవి, సత్యకుమారి, రమాదేవి పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శుల ధర్నా

- ఉపసర్పంచ్ భర్త పంచాయతీ కార్యదర్శిపై దాడి చేశాడని ఆరోపణ



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గంభీరావుపేట: మండలం జగదాంబతండా ఉపసర్పంచ్ భూక్య ప్రమీల భర్త మోహన్ తనపై దాడి చేశాడని, అసభ్య పదజాలంతో దుర్భాషలాడరని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆరోపించారు. దాడిని నిరసిస్తూ మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆయనకు మద్దతుగా గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉపసర్పంచ్ భర్తపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పరిపాలనకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేయడానికి ఉపసర్పంచ్ నిరాకరిస్తున్న క్రమంలో సర్పంచ్‌తో పాటు జాయింట్ చెక్ పవర్ కోసం నూతన వార్డు సభ్యుడిని ఎన్నుకోవడానికి గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంలో ఉపసర్పంచ్ భర్త మోహన్ తనపై దాడి చేశాడని, తిట్టాడని కార్యదర్శి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. నూతనంగా ఎన్నికైన వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్‌ను గురువారం శాలువా కప్పి అభినందించారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తనవంతు సహాయ సహకారం అందిస్తానన్నారు. నూతన కార్యవర్గసభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

చందుర్తి: మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన నల్ల ఆదిరెడ్డికి రూ.లక్షా 25 వేల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆదిరెడ్డి కొన్నినెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఖరీదైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఈ విషయాన్ని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంగీత నిలయంలో బాధితుడికి ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, రామారావుపల్లె, సనుగుల గ్రామాల సర్పంచులు ఆయిల్నేని కమలాకర్ రావు, లింగంపల్లి కరుణాకర్, నాయకులు ఆడగట్ల ఆనందం, మారుపాక మధు, నల్ల వెంకట్ రెడ్డి కిరణ్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి పీఏసీఎస్ పరిధిలోని అనుపురం గ్రామంలో సంఘం దుకాణాల సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంఘం పాలకవర్గం గురువారం ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, పీఏసీఎస్ చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, శీలం రామచంద్రరెడ్డి, చిలివేరి సత్తయ్య, పోచవేణి నాగరాజు, జడల రవీందర్, కాశ శ్రీనివాస్, పర్శరాములు పాల్గొన్నారు.

ముందస్తు అంబేడ్కర్ జయంతి

చందుర్తి: మండలం మర్రిగడ్డ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ముందస్తుగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. హెచ్ఎం సంపతి రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి వస్తుంది'

ఇల్లంతకుంట: తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకుని అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో గురువారం బీజేపీ బూత్ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, రంజిత్, దేశెట్టి శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రసన్న, ముత్తక్క, బాబు, రాజు, శేఖర్, రాకేష్, రాజు, శ్రీకాంత్, సాయి, రాజు, శేఖర్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

8 గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలు

ముస్తాబాద్: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎమ్ జయసుధ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడం, మిల్లులకు తరలించడంతోపాటు కేంద్రాల్లో ఏర్పాట్లకు సీసీలకు ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిపారు. గూడెం కేంద్రానికి పద్మ, మోహినికుంట, వెంకట్రావుపల్లె రమేశ్, తెర్లుమద్ది, సేవాలాల్ తండా కేంద్రాలకు లక్ష్మణ్, మొర్రాపూర్‌కి శోభన్ బాబు, నామాపూర్‌కు సరోజన, రాంరెడ్డిపల్లెకు పద్మను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు తెలిపారు.

రైస్ మిల్లులు తనిఖీ

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ పరిసరాల్లో ఉన్న రెండు రైస్ మిల్లులను గురువారం తహసీల్దార్ దర్పెల్లి నరేశ్ తనిఖీ చేశారు. మరికొద్ది రోజుల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైస్ మిల్లుల్లో ఉన్న పరిస్థితులు గమనించారు. త్వరలో కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేది ఉన్నందున మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పది రోజుల్లోగా సీఎంఆర్ చేయాలని ఆదేశించారు. సీఎంఆర్‌లో అలసత్వం సహించమని అన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని కేశన్నపల్లి, పత్తికుంటపల్లి గ్రామాల్లోని హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య గురువారం పరిశీలించారు. వేసవికాలం అయినందున మొక్కలకు ఉదయం, సాయంత్రం తప్పని సరిగా నీరు సక్రమంగా పట్టాలని, దీంతో పాటు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

చేయూత

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో అనారోగ్యంతో మృతిచెందిన గీత కార్మికుడు దూలం పర్శరాములు కుటుంబానికి పీసీసీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు గురువారం చేయూతను అందించారు. క్వింటాలు బియ్యం, నగదు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

పాఠశాలకు టేబుళ్లు అందజేత

కోనరావుపేట: మండలం నిజామాబాద్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు టేబుళ్లను అందజేశారు. పాఠశాలలో 2004–05 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు తమవంతు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తు రవీందర్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన అమరం భాస్కర్‌రెడ్డి రూ.48 వేలు, కదిరె ఓజల్‌కు రూ.60 వేలు, దప్పుల లస్మయ్యకు రూ.16 వేలు చెక్కులు సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదానం చేసినట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

సాధనాశూరుల ప్రదర్శన

కోనరావుపేట: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సాధనాశూరుల ప్రదర్శన ఆకట్టుకుంది. తల మీద పొయ్యిపెట్టి వంటకాలు చేయడం, దేవతలను సృష్టించడం, తాళ్లతో బంధించిన వ్యక్తి మాయమవడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మంచికట్ల రమేశ్, కులపెద్దమనిషి మార్గం సత్తయ్య, అలువాల నిత్యానందం పాల్గొన్నారు.

క్రీడా సమాచారం

మే 1 నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

సిరిసిల్లకల్చరల్: మే 1 నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించనున్నట్లు జిల్లా క్రీడాధికారి కె. ఉపేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 రోజుల పాటు సుమారు 10 చోట్ల నిర్వహించబోయే శిబిరాలను నిర్వహించేందుకు సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 21 లోపు తమ ఆసక్తిని తెలియజేసే పత్రాలను కలెక్టరేట్‌లోని జిల్లా క్రీడల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: అకాల వర్షాలతో, చీడపీడలు, తెగుళ్లతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంటలను సర్వే చేసి రైతులకు ఎకరానికి రూ.పది వేల నష్టపరిహారం చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించి నెల రోజులు కావొస్తున్నా ఇప్పటికి అధికారులకు ఎలాంటి ఆదేశాలు అందలేదని, పంటల సర్వే చేయడం లేదన్నారు. వెంటనే సర్వే ప్రారంభించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాజీద్, పర్శారాంగౌడ్, రాజిరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, రాము, శ్రీనివాస్ యాదవ్, రేపాక రాజు, బాబు, తిరుపతి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం కావడంతోనే ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి విమర్శించారు. ముస్తాబాద్‌లో విలేకరులతో గురువారం మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఇప్పుడు ఆత్మీయ సభ్యులతో వస్తున్నారని అన్నారు. 2018 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ముస్తాబాద్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ముప్పై పడకల ఆసుపత్రి, దళితులకు మూడెకరాలు అమలు కాలేదని, చాలా గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించలేదన్నారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ప్యాక్స్ వైస్‌చైర్మన్ రవి, బుర్ర రాములు, రాజేశం, దీటి నర్సింలు, అనిల్, బాలరాజు, నర్సింలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కేంద్రం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రం గత తొమ్మిదేళ్లుగా ఓబీసీ వర్గాల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పేందుకు పల్లె పల్లె కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో కూడా బీజేపీ ఓబీసీ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. నాయకులు పొన్నాల తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మానుక నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.